# తీసుకో నీతాళి

## పొట్టిముత్యాల వనజ

కృష్ణమోహన్‌గారు బ్యాంకులో మేనేజర్. అతని భార్య రాధ, వారి సంతానం ఒక్క కొడుకు కిరణ్, ఇద్దరు కూతుళ్ళు దివ్య, కావ్య.

పెద్దమ్మాయి దివ్య బి.కామ్ సెకండియర్ చదువుతూంది. తర్వాత కిరణ్ ఇంటర్ ఫస్టియర్. ఆ తర్వాత కావ్య నైన్త్‌క్లాస్ చదువుతూంది.

ఆరోజు

దివ్యను చూడ్డానికి పెళ్ళివారు వచ్చారు. దివ్య అందంగా నడుస్తూవచ్చి పొందికగా సోఫాలో కూర్చుంది.

"చూడమ్మాయ్! చదువుకున్న పిల్లవు అలా సిగ్గు పడుతూ తలొంచుకుని కూర్చుంటే ఎలా? మా అబ్బాయిని చూసి నీకు నచ్చాడో లేదో మాకు చెప్పాలి మరి!" అంది కాంతమ్మగారు.

ఆ మాటకు మెల్లగా తలెత్తి పెళ్ళికొడుకు వర కుమార్‌వైపు చూసింది దివ్య.

ఆహా! ఎంత అందం, మన్మధుని తలదన్నేట్లుగా వున్నారు. చక్కని తెలుపు, ఒత్తైన క్రాపు: నునుపైన బుగ్గలు, సన్నని మీసం, పెద్దకళ్ళు. ఆ కళ్ళలోకి చూస్తుంటే తన మేను తన్మయత్వంతో తేలిపోతూంది.

వరకుమార్ కూడా దివ్యవైపే చూడ్డంతో, చప్పున తన చూపులు దించుకుని ముసి ముసిగా నవ్వుకుంటూ లోపలకెళ్ళిపోయింది దివ్య.

కాంతమ్మా, పరంధామయ్యగార్లు గొప్ప ఆస్థిపరులు. వీరికి లక్షలు విలువ జేసే పెద్ద బట్టల షాపు వుంది. ఈ ఆస్థికి వారసుడంటూ కావాలనీ, మగపిల్లవాడి కోసం ఎన్నెన్నో పూజలు, వ్రతాలు చేయసాగారు.

వరుసగా ఆడపిల్లలే పుట్టుక్కు రాసాగారు. కానీ కాంతమ్మ పట్టువదలని విక్రమార్కుని మల్లే మగపిల్లవాడు కలిగేంత వరకూ ఇలాగే కంటూ వుంటానని భీష్మించుక్కూర్చుంది.

ఆఖరికి ఆరుమంది ఆడపిల్లల తర్వాత ఈ వర కుమార్ పుట్టి వంశాన్ని నిలబెట్టాడు. లేక లేక పుట్టిన వాడవడం చేత ఎక్కడికీ బయట తిరగనీకుండా; ఫ్రెండ్స్‌తో కలవనీకుండా; ఇంట్లోనే పెట్టుకుని ఆఖరికి అతగాడ్ని 'అమ్మకూచి'గా తయారు చేసింది.

ఎలాగైతేనేం వరకుమార్ బి.ఎ. పూర్తి చేశాననిపించాడు. తన తండ్రితోపాటూ ఆషాపు చూసుకుంటున్నాడు.

ఆరుమంది ఆడపిల్లలకూ పెళ్ళిళ్ళయి పోయాయి. ఇక మిగిలింది కుమార్ ఒక్కడే: కుమార్‌కి పెళ్ళి చేయాలంటే కాంతమ్మకు మనసొప్పడం లేదు.

ఎందుకంటే ఇంత మురిపెంగా చాకిన ముద్దుల కొడుకుని పరాయి దానికి అప్పగించడమంటే ఆమెకి బాధ కల్గిస్తుంది.

అలా అని పెళ్ళి జేయకుండా ఎంత కాలమని ముదరబెట్టుంది. మళ్ళీ అతగాడికీ వంశోద్ధారకులు పుట్టుకు రావాలిగదా!

గయ్యాళి కోడలొస్తే తన అమాయకుడైన కొడుకుని కొంగున ముడి వేసుకుంటుందేమో నన్న భయంతో నోరులేని మెతక పిల్లకోసం గాలింపు మొదలుపెట్టింది.

అప్పుడు ఒక స్నేహితురాలి పెండ్లికని తన ఫ్రెండ్సందరితో కలిసి ఆవూరు వచ్చిన దివ్య కాంతమ్మదృష్టిని ఆకర్షించింది.

వెంటనే దివ్య పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుసుకుని మంచిరోజు చూసుకుని ఇలా బయలుదేరి వచ్చేశారు.

"కృష్ణమోహన్‌గారూ! దివ్య మా కందరకూ నచ్చింది. ఇకపోతే మీరిచ్చే లాంఛనాలవీ మాట్లాడుకున్నామంటే త్వరలోనే ముహూర్తాలు పెట్టేసుకుందాం:" అన్నారు కాంతమ్మగారు.

"చూడండీ! ఇంట్లో పెళ్ళీ, పేరంటం మొదలు పెట్టడం ఇదే మొదటిసారి. లాంఛనాలగురించి మాకు పెద్దగా తెలియదు. అసలు మాకిప్పట్లో దివ్య పెళ్ళి చేయాలనే తలంపే లేదండీ. అలాగని వెదుక్కుంటూ ఇంటికి వచ్చిన సంబంధాన్ని కాదనడం బాగోదని అనుకున్నాము. అందుకని మీరేమడగదలుచుకున్నారో అడగండి!" అన్నారు క్రిష్ణమోహన్‌గారు.

"మేమడుగుతున్నది మాకోసం కాదయ్యా! రేపు పెళ్ళికి వచ్చిన వారందరూ మీకోడలు ఎంత కట్నం తెచ్చింది. పుట్టింటి వాళ్ళు ఆ అమ్మాయికి ఎన్నెన్ని నగలు పెట్టారు అని అడుగుతుంటారు. అప్పుడు హీనంగా చెప్తే మాపరువేంకాను? గొప్ప గొప్ప వాళ్ళందరూ లక్షలు కట్నం ఇస్తాం మా పిల్లను చేసుకోండీ... మాపిల్లను చేసుకోండి... అని యింటి చుట్టూ తిరుగుతున్నా మేము పట్టించుకోలేదు. దివ్య అందాన్ని చూసి మాయింటి కోడల్ని చేసుకోదలచామేకానీ, మీ పెట్టుబోతల్ని ఆశించి కాదు. మీ పరిస్థితిని అర్థం చేసుకున్నాను కాబట్టే మా అబ్బాయికి ఒక యాభైవేలు కట్నం. మీ అమ్మాయికి ఓ యాభైవేల నగలు పెట్టి మా స్టేటస్‌కు తగ్గట్టుగా గ్రాండ్‌గా పెళ్ళి చేయండి చాలు" అంది కాంతమ్మ.

అంత డబ్బున్నావిడ ఇంత నిర్మొహమాటంగా అడుగుతున్నందుకు క్షణకాలం నివ్వెర పోయింది రాధ.

ఆ తర్వాత తేరుకుని.

"కాంతమ్మగారూ! మీరడిగింది మీదృష్టికి చాలా తక్కువే కావచ్చు. మేము మీలాగా వ్యాపారస్తులం కాదండీ. మాకు దివ్య ఒకటే కాదుగా. వెనక ఇంకా ఇద్దరు చిన్నపిల్లలున్నారు. వాళ్ళ బాధ్యతలూ చూడాలికదా! అందుకని ఇరవైవేలు కట్నం, పదివేలకి నగలు పెడ్తాం. ఇంతకంటే మాకెక్కువ పెట్టే స్థోమత లేదండీ!" అని తేల్చేసింది రాధ.

"ఆడపిల్లగలవారు మీరే ఇంత నిఖచ్చిగా చెప్తే ఇక మేమేం చేయగలం. వెళ్తాం" అంటూ లేచారు.

ఇది కేవలం బెదిరింపు మాత్రమేనని వూహించలేక పోయారు కృష్ణమోహన్‌గారు.

ఇలా ప్రతియిండ్లలోనూ జరుగుతూవుంటాయి. లాంఛనాల దగ్గర కొచ్చే సరికే ఆఖరున మంగళ హారతిలాగా ఈ మాటంటూ లేచిపోవడం ఆ పిల్ల తల్లిదండ్రులు బెంబేలెత్తిపోయి వాళ్ళడిగినవి కాదనకుండా సమకూర్చడం పరిపాటైపోయింది.

ఈవార్త విన్న దివ్య ఏడుస్తూ పడుకుంది.

అమ్మా, నాన్న ఇంతకంటే గొప్పింటి సంబంధాన్ని తెచ్చి పెళ్ళిచేయగలరా! అందమైన భర్తతో అలా అలా కార్లలో షికార్లు చేయాలనీ, ప్రతి కన్నెపిల్లా ఇలానే కలలు కంటుందనీ ఎందుకనుకోరు ఈ తల్లిదండ్రులు?

'గొర్రెతోక బెత్తెడే' అన్నట్లు ఆఖరికి చాలీ చాలని ఓ జీతగాడ్ని తెచ్చి ముడి పెట్టారు. ఆమాట తలుచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

దివ్య మనసులోని బాధని అర్థం చేసుకుంది రాధ.

దివ్య సుఖసంతోషాల కోసం ఉన్న స్థిరాస్తులమ్మైనా సరే! ఈ పెళ్ళే ఖాయపరచాలనుకుంది.

ఆఖరికి పాతికవేలు కట్నం, పాతిక వేలు నగలతో పెళ్ళి నిశ్చయించుకుని ముహూర్తాలు పెట్టేసుకున్నారు.

కుమార్‌తో దివ్య పెళ్ళి ఘనంగా జరిగిపోయింది. దివ్య ఆనందానికి అంతే లేకుండా వుంది. ఇంద్ర భవనం లాంటి లంకంత ఇల్లు. అందులో ఎ.సి రూములు ఖరీదైన ఫర్నిచర్, ఎ.సి. కారు. అందగాడైన భర్త. తను లక్షాధికారి ఇంటి కోడలౌతుందని కలలో కూడా వూహించలేదు. ఇక ఆడదాని జీవితంలో ఇంతకంటే ఏం కావాలి?

ఆ రాత్రే శోభనం:

ఫ్రెండ్సందరూ చేసే చిలిపి అల్లరికి దివ్య మనసంతా గిలిగింతలు పెడ్తూంది. పాలగ్లాసు చేత పట్టుకుని ఏవేవో కోరికలు గుండెల్నిండా నింపుకుని గదిలోనికి

**అత్తగారింట్లో అడుగు పెట్టిన దివ్యకు బ్రతుకంతా అంధకారం అలుముకున్నట్లుగా వుంది. ఒక సరదా లేదు ఒక సంతోషమూ లేదు. తినాలన్నా, తిరగాలన్నా, మాట్లాడాలన్నా, నవ్వాలన్నా అత్తగారి ఆర్డర్ కావాలి.**



అడుగు పెట్టింది దివ్య.

కుమార్ దగ్గరికి వస్తాడనీ తనని హృదయానికి గట్టిగా హత్తుకుని హీరోలా ఎత్తుకుని మంచం దగ్గరకు తీసుకెళ్తాడనీ కలలు గంటూ నిల్చునుంది. చాలా సేపు గడిచింది కుమార్ రాలేదు.

"ఎంతసేపలా నిల్చుంటావ్! వచ్చి అక్కడ కూర్చో!" అని అంటున్న కుమార్ గొంతువిని తలెత్తి చూసింది.

తాపీగా మంచం మీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు.

"పాలు!" ఎలాగో గొంతు పెగుల్చుకుని అంది దివ్య.

"నాకలవాటు లేదు"! అంటూ మళ్ళీ పుస్తకం చదవడంలో నిమగ్నుడయ్యాడు.

ఆ గ్లాసు దగ్గర్లో నున్న టీపాయ్ మీదుంచి, తడబడుతున్న అడుగులతో నడచివచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంది దివ్య.

ఆగదిలో గాలి స్తంభించి పోయినట్లుగా వుంది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోస్తున్నాయ్.

పుస్తకం చదవడం పూర్తయినట్లుందేమో! ప్రక్కన పెట్టూ.

"నిద్రొస్తుందా! అన్నాడు కుమార్!

"ఊహూ!" అంది దివ్య.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

దివ్య మనసంతా బాధతో నిండి పోయింది. తనూహించింది ఒకటి, జరిగేది వేరొకటి! ఎంతసేపని మౌనంగా కూర్చోగలదు.

అతికష్టం మీద మాటలు కూడ దీసుకుని

"నన్ను పెళ్ళి చేసుకోవడం మీకిష్టం లేదా!" అంది దివ్య.

"ఇష్టం లేదని ఎవరన్నారు? కానీ! నీమెడలో తాళి కట్టిన రోజునుండీ తొమ్మిది రోజులవరకూ మనిద్దరం కలవ కూడదట. ఈ విషయం చాలా రహస్యంగా వుంచాలిట. ఇంకెవరికైనా తెలిస్తే నేను బ్రతకనట. నా జాతకంలో అలా రాసి వుందట. మా అమ్మ చెప్పింది. అందుకే మనం తొమ్మిది రోజుల వరకూ..."

దివ్య నెత్తిన పిడుగు పడ్డట్లనిపించింది. ఈ మాటలు నమ్మశక్యం కావడం లేదు. అత్తగారి మనసులో ఏదో పెట్టుకుని ఇలా చేస్తూందని పిస్తూంది.

కుమార్ మంచం దిగాడు. జాయింటుగా నున్న రెండు మంచాల్లో నొకదాన్ని దూరంగా లాగుతున్నాడు. అలా లాగుతుంటే తన హృదయాన్ని రెండుగా చీలుస్తున్నట్లూ ఆమధ్యలో అత్తగారు నిలబడి వికటాట్టహాసం చేస్తున్నట్లు అన్పిస్తుంది.

"దివ్యా! మా అమ్మకు బి.పి. ఎక్కువ. ఆవిడ్ని నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలి. మా అక్కయ్యలు తరుచు వస్తూవుంటారు. వాళ్ళని మర్యాదగా చూడాలి. మా అమ్మ మాటకు ఎదురు చెప్పకు. ఆవిడ మనసు నొప్పించకు" ఇంకా ఏమిటేమిటో చెప్తున్నాడు కుమార్.

ఈ మాటలు నవ వధువుతో చెప్తున్నట్లుగా లేవు. కొత్తగా పనిలో కొచ్చిన పని మనిషితో బట్టలుతకాలి! ఇల్లు శుభ్రంగా తుడవాలి! గిన్నెలు బాగా తోమాలి! అన్నట్లుగా వుంది.

కుమార్ నిద్రొస్తూందని లైటు ఆఫ్ చేసి బెడ్ లైట్ వేసి పడుకున్నాడు.

దివ్యకు నిద్ర రావడం లేదు. ఎగదన్నుకొస్తున్న ఏడుపును నిగ్రహించుకోలేక పోతూంది. కళ్ళ నుండి నీరు చెంపల మీదుగా కారిపోతున్నాయి.

కుమార్ వైపు చూచింది. హాయిగా నిద్రపోతున్నాడు మెల్లగా నడచి వెళ్ళి వారి నుదుటి మీద ముద్దు పెట్టు కోవాలన్పిస్తూంది. తనకే ఇలాంటి కోరిక కలుగుతూంటే! మగాడిగా వుండి వారికి ఏ వాంఛ్ఛా కలగడం లేదా! ఇతనేమైనా జడ పదార్థమా!

ఆ రాత్రంతా నిద్ర పోలేదు దివ్య.

తెలతెలవారు తుండగానే దూరంగా లాగిన ఆ మంచాన్ని కుమార్ మంచానికి ఆనించింది. తను వెళ్ళి స్నాన పానాదులు ముగించుకుని హాల్లోకొచ్చి కూర్చుంది. నిద్ర లేని కళ్ళను చూసి అందరూ ఒక్కో విధంగా కామెంట్ చేయడం మొదలు పెట్టారు. అన్నింటికీ మౌనమే దివ్య సమాధానం. తన మదిలో ఓ గేయం మెదలుతూంది. 'మౌనమె నీబాష ఓ మూగ మనసా!' ఆ పాటలోని గూఢార్థం ఇప్పుడర్థమౌతూంది.

ఆ తొమ్మిది రోజులూ తొమ్మిది యుగాల్లా గడిచాయి.

ఆ రాత్రి!

కుమార్ కౌగిలిలో నలిగిపోతూంది దివ్య. కానీ! ఆ సుఖం దివ్యకు తృప్తి కలగడం లేదు.

ఈ తొమ్మిది రాత్రులు కుమార్ తన తల్లి ఆజ్ఞ శిరసావహించి ఎంత చక్కగా మడి కట్టుకుని కూర్చున్నాడు.

ఈ పని చేయడానిక్కూడా అత్తగారు పర్మిషన్ ఇవ్వాలా! ఛీ ఛీ! దివ్య ఒళ్ళంతా జుగుప్సతో నిండి పోతూంది.

రోజులు యాంత్రికంగా గడచిపోతున్నాయి.

అత్తగారింట్లో అడుగుపెట్టిన దివ్యకు బ్రతుకంతా అంధకారం అలుముకున్నట్లుగా వుంది. ఒక సరదా లేదు. ఒక సంతోషమూ లేదు. తినాలన్నా, తిరగాలన్నా, మాట్లాడాలన్నా, నవ్వాలన్నా అన్నింటికీ అత్తగారి ఆర్డర్ కావాలి. మామగారు కూడా అత్తగారి చేతిలో కీలుబొమ్మ. పుట్టింటినుండి వుత్తరాలు వస్తే అవి తనదాకా రానీరు. మధ్యలోనే చించిపారేస్తారు.

కాపురాని కొచ్చిన కొత్త కోడలికి ఆరోజునించే ముఖానికి పౌడర్ కళ్ళకు కాటుకా నిషేధించింది అత్తగారు.

"అందమైన పిల్లవు నీకెందుకివన్నీ: నుదుట కుంకుమ పెట్టుకో చాలు"! అంది అత్తగారు.

"ఔనౌను! నేచురల్ బ్యూటీ అంటేనే నాకు చాలా ఇష్టం," అని తల్లి మాటకు కుమార్ తాళం కూడా వేశాడు.



బదిలీ

"ఎంతచెప్పినా ఆఫీసర్లు నన్నింకో వూరికి బదిలీ చెయ్యడంలేదురా. ఏం చెయ్యమంటావు!" అడిగాడు కానిస్టేబుల్ లాఠీరావు.

"వెరీసింపుల్; ఓ పత్రికా విలేఖరి మీదలాఠీ ప్రయోగించు" సలహా ఇచ్చాడు మిత్రుడు బాకీరావు.

—రవిచిత్ర (సిరిసిల్లా)

అప్పట్నుంచే దివ్య వంటింటికి అంకితమై పోయింది. ఆరుమంది కూతుళ్ళలో ఒకరు కదుపులనీ, ఇంకొకరు కానుపులనీ! వచ్చి పుట్టింట్లో తిష్ట వేసుకుని కూర్చుండి పోతారు.

వారు కోరిన విధంగా వండి వడ్డించాలి. కోడలొచ్చాక వంటలు పనివాళ్ళు చేయకూడదట్ల, కోడలే వండాలి. ఆ వండిన కూరలకు వంకలు పెడ్తూ, దివ్యను తిడ్తూ తినాలి.

ఇది రోజూ అత్తగారూ, ఆడ బిడ్డల దినచర్య.

వంట పనేమిటో తెలియకుండా సరదాగా ఆడుతూ, పాడుతూ పెరిగిన దివ్య ఈ పెళ్ళి అనే పేరుతో కత్తుల బోనులో బంధింప బడినట్లైంది.

తొలి పండుగ దీపావళికి కూతుర్నీ, అల్లుడ్ని పిలుచుకు పోడానికని రాధ, కృష్ణమోహన్ వచ్చి కాంతమ్మను అడిగారు.

"చూడండీ! రాధగారూ! మీరు అమ్మాయినీ, అబ్బాయినీ తీసుకెళ్ళి ఏం పెట్టి పంపు దా మనుకుంటు న్నారు?" అంది కాంతమ్మ.

"ఏముందండీ! అందరిలాగే ఇద్దరికీ బట్టలు పెట్టి పంపుతాము". అంది రాధ.

"ఎవడిక్కావాలి మీ బోడి బట్టలు! లక్షలు విలువ జేసే బట్టల షాపు పెట్టుకుని, మీరు పెట్టే వాటి కోసం కాసుకోనున్నా మనుకున్నారా! మా అబ్బాయికి ఒక కొత్త స్కూటర్ కొనివ్వండి. అలాగ ఒప్పుకుంటేనే ఇద్దర్నీ పంపుతాం! లేదంటే వచ్చిన దార్నే వెళ్ళిపొండి". అని ఖచ్చితంగా చెప్పేసింది కాంతమ్మ. రాధకూ, కృష్ణమోహన్‌కూ ఏం చేయాలో పాలు పోవడం లేదు. మొన్న పెళ్ళికని చేసిన అప్పు ఇంతవరకూ తీర్చలేదు. ఇంతలో స్కూటర్ అంటే మాటలా?

ఈ కేకలు విని ఎవరై వుంటారా! అనుకుంటూ వంట

మీరనుకుని





**ఇష్టమైన చిత్రం**

**ప్రముఖ చిత్రకారుడు పికాసో చిత్రం ఒక్కటి కూడా తన దగ్గరుంచుకునే వాడు కాదు.**

**ఒక అతిథి అడిగాడు. "మీ చిత్రాలంటే మీకు ఇష్టంలేదా!".**

**"లేక పోవడ మేమిటి; నా చిత్రాలంటే నాకు ప్రాణం. కానీ వాటిని ఇంటల్లో వుంచుకునేంత ధనికుడిని కాదు నేను" అన్నాడు పికాసో.**

**—శ్రీశారద (అమలాపురం)**

గదిలో నుండి బయటకు వచ్చి తన అమ్మా, నాన్నలను చూసింది దివ్య.

దివ్య ముఖమంతా బాగా పీక్కుపోయి చాలా నీరసంగా వుంది. శరీరంలో ఏదో మార్పు గమనించింది రాధ.

"ఎన్నో నెల?" అంది రాధ.

"మూడు", అంది దివ్య.

"కాంతమ్మగారు! అమ్మాయి వేవిళ్ళతో బాధ పడ్తున్నట్లుంది. ఓ నెల రోజులు అమ్మాయినైనా పంపండి". అంది రాధ బతిమాలుతూ.

"నెల రోజులు తీసుకెళ్తే! ఇక్కడ పనెవరు చేస్తారు. నువ్వొచ్చి చేస్తావా! మీ ఆయనొచ్చి చేస్తాడా!"

"మాటలు తిన్నగారానీయండి" అన్నారు కోపంగా కృష్ణమోహన్‌గారు.

"ఏంటయ్యా! నీ బెదిరింపులు. అల్లుడికి స్కూటర్ కొనివ్వడానికి స్తోమత లేనివాడివి, పౌరుషానికేం తక్కువేం లేదు".

"నాన్నా! మీరెళ్ళి పోండి. నా గురించి ఇలా తగువు లాడ్డం బాగోదు". అంటూ; వేరే గదిలోకి తీసుకెళ్ళిపోయింది దివ్య.

"దివ్యా:నిన్ను చూస్తూంటే నా గుండె తరుక్కు పోతుందమ్మా. అల్లుడికి స్కూటర్ తీసిస్తామంటేనే నిన్ను పంపుతారట ఎలా?" అంది కన్నీరెట్టుకుని రాధ.

"వద్దమ్మా: మీరిదేమీ పెట్టుకోకండి. వాళ్ళీనాడు స్కూటర్ అంటారు. రేపు ఇంకోటి అడుగుతుంటారు. నన్ను పంపడానికిష్టం లేక ఈ విధంగా అంటున్నారు. నాన్నగారి పరిస్థితి నాకు తెలియంది కాదు.

చీకటి కొన్నాళ్ళూ, వెలుతురు కొన్నాళ్ళూ అన్నట్లు ఇలా ఎల్లకాలం ఒకే లాగుండదమ్మా. నాకూ మంచి రోజులొస్తాయి. అంతవరకూ ఓపికతో ఎదురు చూడాలి. అంతే అంది దివ్య.

దివ్యకు ఇంత గుండె నిబ్బరం ఎలా అలవడిందో, అర్థంకాక చూస్తూండి పోయింది రాధ.

"తమ్ముడూ, చెల్లీ ఎలావున్నారు?

"ఈ రోజు నువ్వొస్తావని ఆశతో ఎదురు చూస్తుంటారు. వాళ్ళకి నేనేమని చెప్పను?" అంది రాధ బాధపడుతూ.

కాంతమ్మ ఏదో సణుక్కుంటూ ఇటు వచ్చింది.

"అమ్మా మీరిక వెళ్ళిపోండి. నాగురించేమీ దిగులుపడకండి." అంటూ తల్లినీ, తండ్రినీ పంపేసింది దివ్య.

ఇంటికి వచ్చిన అమ్మానాన్నలని కూర్చోమని చెప్పడానిగ్గానీ, గుక్కెడు కాఫీ నీళ్ళు ఇవ్వడానిక్కూడా నాకు అధికారం లేదు. ఎందుకీ పాడు బతుకు. కుమిలి కుమిలి ఏడవ సాగింది దివ్య.

రోజులు గడుస్తున్నాయి.

పని భారం వల్ల మరీ నీరసించి పోతూంది దివ్య. నెలలు నిండాయి. తన భర్త మంచివాడే! కాని తల్లి ఎందుకూ కొరగాకుండా చేసింది. ఇక లాభం లేదు. ఎలాగైనా కుమార్‌ని ప్రాధేయపడి వేరే కాపురం పెట్టడానికి ఒప్పించాలి. అప్పుడు గానీ వారు బాగుపడరు. మంచిరోజు చూసుకుని తన మనసులో మాట కుమార్‌తో చెప్పేయాలి.

ఆ మంచి తరుణం కోసం ఎదురు చూడసాగింది.

వంట చేస్తున్న దివ్యకు నెప్పులు మొదలవడంతో బాధపడ్తూ మెలికలు తిరిగి పోసాగింది.

కాంతమ్మ కోడల్ని హాస్పిటల్‌లో చేర్పించి కృష్ణమోహన్‌కి టెలిగ్రాం ఇప్పించి చేతులు దులుపుకుంది.

హుటాహుటీన కంగారుపడ్తూ హాస్పిటల్‌కి వచ్చేశారు. రాధ, కృష్ణమోహన్ గార్లు.

కూతురి దీనావస్థ చూశారు. నొప్పులతో దివ్య బాధద పడ్తూంటే ప్రక్కన ఓదార్చే వారెవరూ లేరు.

"వీళ్ళు మనుషులా? రాక్షసులా? ఇంతకాలం చాకిరీ చేయించుకుని నెప్పులు రాగానే ఇలా దిక్కులేని దానిలా పడేస్తారా! మొగుడనే వాడికైనా కనికరం లేదా! ఆవిడ కూడా తన పిల్లలందరకూ ఇలాగే కానుపులు చేసిందా!".

ఆ తర్వాత దివ్య అతి కష్టం మీద ఆడపిల్లను ప్రసవించింది.

అందంలో తల్లీ, తండ్రిని మించిపోయింది ఆ చిన్నారి పాప.

ఆ సాయంత్రం కుమార్ ఒక్కడే వచ్చాడు. పాపను చూశాడు.

"బాబూ! కుమార్! మేము ఇల్లూ వాకిళ్ళూ ఒదిలి పెట్టుకుని ఇలా హోటల్లో తింటూ హాస్పిటల్లో పడి వుండాలంటే చాలా కష్టంగా వుంది. అందుచేత దివ్యకు పూర్తి ఆరోగ్యం చేకూరేంత వరకూ మా యింటికి తీసుకెళ్ళాలను కుంటున్నాం, ఏమంటావ్ బాబూ!" అన్నారు కృష్ణమోహన్.

"మీరీ మాట అంటారని మా అమ్మ నాకేనాడో చెప్పిందండీ! మీ యింటికి దివ్యను తీసుకెళ్ళక్కర్లేదు. మీరు విరుద్దంగా తీసుకెళ్ళాలనుకుంటే ఇక శాశ్వతంగా మీ దగ్గరే వుంచుకోండి". అనేసి చరచరా వెళ్ళి పోయాడు కుమార్.

"తల్లి దగ్గర పిల్లి. ఇక్కడ చూడు! పులిలా ఎలా గర్జిస్తున్నాడో!"


"దివ్యా! ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. నువ్వు మనింటి కొచ్చేసెయ్. వాళ్ళకప్పుడు నీ విలువేమిటో తెలిసొస్తుంది భార్య మీద ప్రేమనేదే వుంటే కుమార్ నిన్నెతుక్కుంటూ వస్తాడు. లేదా! ఎన్ని రోజులుంటాడో వుండనీ! నువ్వు మాకేం బరువా!" అంది రాధ.

"వద్దమ్మా! ఆడ దానికి తొందర పాటు పనికి రాదు. ఎలాగో ఇన్నాళ్ళూ ఓపిక పట్టాను. పాప పుట్టాకైనా వారు మారకుండా వుంటారా! నేనెలాగైనా వార్ని దారిలోకి తెచ్చుకుని వేరే కాపురం పెడ్తాను. నాకా నమ్మకం వుందమ్మా! నేనూ ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను. త్వరలోనే ఈ సమస్యకు కాలమే తీర్పు చెప్తుంది. మీరంతవరకూ నిశ్చింతగా వుండండి."

రోజుకు ఒక్క ఐదు నిమిషాలు మాత్రం కుమార్ హాస్పిటల్‌కి వచ్చి చుట్టం చూపుగా చూసెళ్తున్నాడు.

బహుశా! దివ్య పుట్టింటికెళ్ళి పోయిందేమో! చూసి రమ్మని కాంతమ్మ కుమార్‌ని పంపిస్తూ వున్నారని గ్రహించగలిగారు రాధ, కృష్ణమోహన్‌గార్లు.

**సందేహం**



ఏ వేడుకా లేకుండానే దివ్యకు హాస్పిటల్‌లోనే పురిటి నీళ్ళు పోసి దివ్యనూ, పాపనూ కుమార్‌తో పాటూ అత్తగారింటికి పంపించారు. రాధ, కృష్ణమోహన్ బాధపడ్తూ అట్నుంచటే వూరెళ్ళిపోయారు.

కాలచ్రకం గి్రున తిరుగుతుంది.

పాపకు ఐదో నెల వచ్చింది. బొద్దుగా, బంగారు బొమ్మలా ముద్దొస్తుంది పాప.

పాప అనురాధ నక్ష్రతంలో పుట్టినందున 'న' అనే మొదటి అక్షరంతో పేరు పెట్టాలని దివ్య పాపకు 'నవ్య' అని పెట్టింది.

ఈ విషయం తెలిసి కాంతమ్మ నిప్పు తొక్కిన కోతిలా చిందులు తొక్కుతుంది.

"దివ్య... నవ్య... కావ్య! ఏమిటీ పోరంబోకు పేర్లు. అన్నీ వ్వే... వ్వే... వ్వే... అని వెక్కిరించినట్లుగ్గా వున్నాయ్. 'న' అన్నారు కాబట్టి నా కొడుకు పేరు కూడా కలిసేటట్లు 'నరస కుమారి' అని పెట్టండి"! అని ఆర్డర్ జారీ చేసింది.

ఈ పేరు బాగుందంటూ అందరూ తలాడించారు.

ఆఖరికి తన కన్న బిడ్డకు పేరు పెట్టుకునే అర్హత కూడా లేదన్న మాట, ఈ బానిస బ్రతుకు బ్రతికే కంటే ఒక్కసారిగా చావడమే మేలు.

కానీ! బ్రతుకు మీద ఏదో ఆశ. అమావాస్య తర్వాత పున్నమి రాక పోతుందా!

ఆ రోజు ఆదివారం.

షాపు లేదు. అందరూ మధ్యాహ్నం భోజనాలు చేసి పడుకొనున్నారు. గదిలో కుమార్ పాప నెత్తుకుని ఆడిస్తున్నాడు.

"ఏమండీ! మిమ్మల్నో మాటడగనా!" గోముగా అంటూ భర్త పక్కన కూర్చుంది దివ్య.

"మనం వేరే కాపురం పెడదామండీ! నాకిక్కడ ముళ్ళమీద వున్నట్లుంది. మీ అమ్మగారు మీ నాన్నని తన చెప్పుకింద తేలులాగా చేసుకో లేదా! మీ అక్కయ్యలు గీచిన గీటు దాటరు మీ బావలు. వాళ్ళే కోరిక కోరినా కాదనకుండా తీరుస్తుంటారు.

అలాగే నాకు కూడా మీతో సరదాగా తిరగాలనీ! ఇంకా ఏవేవో కోరికలు నాలోనే దాచుకున్నాను. ఇక్కడే వుంటే, మీ అమ్మ మనల్ని సుఖపడ నీయదు".

"నోర్మూయ్! మా అమ్మను ఇంకేమైనా అన్నావంటే చంపేస్తాను జా్రగత్త! నన్ను కనీ, కష్టపడి పెంచీ, నన్నింత వాడ్ని చేసిన మా అమ్మ మీద నీ అక్కసు వెళ్ళ బోస్తావా! మా వాళ్ళపై నువ్వు చెప్పే ప్రతి మాటా ఏదీ దాచనని పెళ్ళికి ముందే మా అమ్మకు దేవుని ఎదుట ప్రమాణం చేసి చెప్పాను". అంటూ చర చరా లేచెళ్ళి పోయాడు.

దివ్య కొయ్యబారి పోయింది.

వెంటనే ఈ వార్త తల్లి చెవులో వూదేశాడు. ఇంట్లో పెద్ద దుమారం చెలరేగింది.

"అమ్మో! అమ్మో! ఇది కోడలు కాదు, కొరివి దయ్యం. పచ్చని సంసారాన్ని నరకంగా మార్చడానికి వచ్చిన కాలకూట విషం", అని ఆ రోజంతా అత్తగారూ ఆడ బిడ్డలూ నానా మాటలూ తిట్టి పోశారు.

'ఇక ఎప్పుడుకుమార్‌కి జ్ఞానోదయమౌతుంది?' అని బాధ పడసాగింది దివ్య.

ఇది జరిగిన మరుసటి రోజే హాల్లో నుండి పెద్దగా రణగొణ ధ్వని వినిపిస్తోంది. ఇది ఎప్పుడూ వుండేదే! అని అనుకుంటూ తన పాటికి వంట చేసుకుంటుంది దివ్య.

అంతే! వెనక మాటుగా వచ్చి దివ్య జుట్టును గట్టిగా ఒడిసి పట్టుకుని బర బరా హాల్లోకి లాక్కొచ్చాడు కుమార్!

"రాస్కెల్! వాడెవడో చెప్పు. నా కన్ను గప్పి నువ్వింతగా బరితెగిస్తావా" అంటూ ఛెళ్ళు.. ఛెళ్ళు మని చెంపల మీద కొడ్తున్నాడు.

ఈ హఠాత్ సంఘటనకి ఖిన్నురాలైంది దివ్య. తనకేమీ అర్థం కాకుండా వుంది.

"ఒరేయ్ చచ్చు పీనుగా! చేత్తో కొడ్తే ఈ వెధవ లంజకు ఏం దెబ్బ తగుల్తుందిరా! ఆ బెల్టు తీసి నాలుగు తగిలించు. అప్పుడుకానీ నిజం ఒప్పుకోదు." అంది కాంతమ్మ.

ఆ మాటనగానే బెల్టు తీసి బలంగా ఫెళ్ళుమని కొట్టాడు కుమార్! ఆ దెబ్బతో దివ్య కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ దెబ్బపడిన చోట అలాగే నెత్తురు చిమ్మింది. మళ్ళీ కొట్టాడు.

దివ్య ఒక్కసారి లేని ఓపిక తెచ్చుకుని "ఆపండి"! అని శక్తి కొద్దీ అరచింది. అది అరుపుకాదు. గావుకేక!

కుమార్ వినిపించుకోలేదు. ఫెడీల్‌మని మళ్ళీ కొట్టాడు. దివ్య ప్రళయ మూర్తిలా అయ్యింది. గబుక్కున ఆ బెల్ట్‌ని పట్టుకుని బలంగా ఒక్క గుంజు గుంజింది. బెల్ట్ దివ్య చేతిలో కొచ్చేసింది.

"ఏమీ తెలియని నన్నిలా ఎందుకు హింసిస్తున్నారో చెప్పండి. ఆ తర్వాత మీరెలా శిక్షించినా నేను భరిస్తాను", అంటూ ఏడుస్తోంది దివ్య.

"అయ్యో! ఎంత నంగనాచివే! ఆ వుత్తరం చూపించరా!" అంది కొడుకు వైపు తిరిగి కాంతమ్మ.

కుమార్ ఆ వుత్తరాన్ని దివ్య ముఖాన విసురుగా గిరాటేసాడు. అది చదివిన దివ్య అచేతనంగా నిలబడి పోయింది. తన కళ్ళను తనే నమ్మలేక పోతూంది. మళ్ళీ ఇంకోసారి వుత్తరం చదవడం మొదలు పెట్టింది.

మై డియర్ దివ్యా! మై స్వీట్ హార్ట్!

ఇంకా ఎంతకాలమని ఈ విరహ వేదనను భరించమంటావు. త్వరలోనే నువ్వు వేరే కాపురం పెడ్తావనీ! నీ మొగుడి కళ్ళు గప్పి మనం ఖుషీగా ఎంజాయ్ చేద్దామనీ, నే నెంత కాలమని కలలు గంటూ గడపను. నువ్వే మో! ఇదిగో! అదిగో! అంటూ ఆలస్యం చేస్తున్నావు. మొన్న మధ్యాహ్నం నీ దగ్గర కొచ్చాను. మీ అత్తా, ఆడబిడ్డలు కుమార్‌తో కలసి సినిమా కెళ్ళారని చెప్పావు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. అప్పుడు నువ్వేమన్నావో తెలుసా! నిన్ను విడిచి నేను బ్రతక లేను. నన్ను నీ కౌగిట్లో కరిగిపోనీ! అంటూ నా హృదయంలో ఒదిగిపోయి నా ముఖమంతా ముద్దులతో ముంచెత్తావు. ఆ మూడు గంటల సేపూ నీ పడగ్గదిలో మనం ఎన్నెన్ని స్వర్గ సుఖాలను అనుభవించాము.

నిన్నూ నా రూపు రేఖలను పుణికి పుచ్చుకున్న మన పాపనూ విడిచి దూరంగా వుండలేక పోతున్నాను డియర్! రోజూ దొంగ చాటుగా నిన్ను కలవడానికి చాలా ఇబ్బందిగా వుంది. ఇక నావల్ల కాదు దివ్యా! ఏదో ఒకటి




ఏమవుతుంది!


అది సైన్స్ క్లాస్.

"నేతి గిన్నె ఎండలో పెడితే ఏమవుతుంది!" అడిగారు మాస్టారు.

"కుక్క ఎత్తుకు పోతుంది సార్" అన్నాడు గిరి.

—బి.ఎ. గణేష్ పా్రత్రో (చివమేరంగి).





గాడిద

"వానిగాడు అల్లరి చేస్తున్నాడు. గాడిద మీద కూర్చుంటాడట..." అన్నాడు భద్రరావు.

"ఆలస్యం దేనికి, వీపుమీద కూర్చో పెట్టుకోండి..." అంది సుభద్ర.

—రవిచిత్ర (సిరిసిల్లా)

నిర్ణయించుకో! ఈ రాత్రికి మీ యింటి వెనకాల వచ్చుంటాను. నువ్వు మన పాప నెత్తుకుని వచ్చేసేయ్. ఎటైనా వెళ్ళిపోదాం".

ఇట్లు
నీ ప్రియుడు
"మధు"

"ఛీ! కులటా! వేరే ఇల్లూ. వేరే కాపురం అని నువ్వింతగా పోరాడింది వాడితో కులకడానికే కదూ!" అన్నాడు కుమార్.

ఈ కేకలకు ఉయ్యాల్లోని పాప లేచి ఏడవడం మొదలుపెట్టింది.

"ఛత్! ఇది నా బిడ్డ కాదు. ఆ మధుగాడితో కన్న పాపఫలం. దాన్ని విసిరి అవతల పారేయండి"! ఉద్రేకంతో గట్టిగా అరుస్తున్నాడు కుమార్.

ఆ మాటతో దివ్యకు ఆవేశం కట్టలు తెంచుకుంది.

"నోర్మూయ్యండి! ఇంతకాలం నాతో సంసారం చేస్తున్నారు. నేనెటువంటి దాన్నో తెలుసుకోలేక పోయారా! దైవ సాక్షిగా చెప్తున్నాను. ఆ మధు ఎవడో నాకు తెలీదు. ఇది మీ వాళ్ళందరూ అల్లిన కట్టుకథ, మిమ్మల్ని నేను వేరే యింటికి తీసుకెళ్ళి ఎక్కడ నా కొంగున కట్టేసుకుంటానోనని మీ అమ్మ పన్నిన పన్నాగం ఇది".

"దైవంలాంటి నా తల్లిని అనడానికి నీ కెన్ని గుండెలే!" కొట్టడానికి చెయ్యెత్తాడు కుమార్.

"దగ్గరకు రాకండి! ఇప్పుడు బెల్ట్ నా చేతిలో వుంది. నేనేం చేస్తానో నాకే తెలీదు! మీరింత వరకూ ఇన్ని దెబ్బలు కొట్టినా నేనెందుకు భరించానో తెలుసా! ఇదిగో ఈ బిడ్డ కోసం! నా మెడలో వున్న మాంగల్యం కోసం! కానీ! నీలాంటి మూర్ఖుడైన భర్తతో రోజూ చచ్చేందుకన్నా ఒక్కసారిగా తెగతెంపులు చేసుకోవడమే మంచిదనే సత్యాన్ని చాలా లేటుగా తెలుసుకున్నాను".

కాంతమ్మ కుమార్‌కి సైగ చేయగానే తటాలున వచ్చి దివ్య మెడను రెండు చేతులతో గట్టిగా బిగిస్తున్నాడు.

దివ్య రుద్రకాళిలా బలంగా ఒక్క తోపు తోసింది. ఆ విసురుకి కుమార్ కాంతమ్మ కాళ్ళ దగ్గర పడిపోయాడు.

వెంటనే మెడలోని తాళి తీసి కుమార్ మీదకు విసిరి కొట్టింది.

"తీసుకో నీ తాళి"! నిన్ను పెళ్ళాడిందానికి నేనన్ని విధాలా సర్వ నాశనమయ్యాను. నా చదువు! నా అందం! నా ఆరోగ్యం! అన్నీ పాడై పోయాయి".

కుమార్! నువ్వు మనిషివి కావు! క్రూరమృగం కడుపులో పుట్టిన నీచాతినీచుడివి. ఎవరో ఏదో! చెప్పారని పెళ్ళాన్ని చావబాదటం మగతన మనిపించుకోదు నేను వెళ్తున్నాను".

"ఓ యబ్బో! బెదిరిస్తున్నావా! ఒక్క నెల తిరిగేసరికల్లా నా బిడ్డకు బ్రహ్మాండమైన సంబంధం తెచ్చి మరో పెళ్ళి చేస్తాను" అంది కాంతమ్మ.

"నువ్వు ఆడదానిగా పుట్టడమే మా ఆడాళ్ళందరికీ సిగ్గుచేటు! ఆరుమంది ఆడపిల్లల్ని కన్నావ్! కోడలు కూడా ఓ తల్లి కన్న బిడ్డేనని అర్థం చేసుకోలేని మూర్ఖురాలివి నువ్వు!" అంటూ వెళ్ళి ఉయ్యాల్లో వున్న పాప నెత్తుకోబోయింది.

"ఒరేయ్! ఎక్కడికో వెళ్ళి పోతున్నట్లుంది. దాన్ని బయటకు పంపకూడదు. ఇక్కడే హతం చేసేయాలి" అంటూ అత్తగారూ ఆడ బిడ్డలు ఒక్క ఉదుటన వచ్చి దివ్య చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నారు.

"దీన్ని త్వరగా చంపెయ్యరా! ఇక్కడే తగలేసేద్దాం! అంటూ ఆర్డరు జారీ చేశారు అత్తగారు.

దివ్య స్థితి ఒడ్డున పడ్డ చేప పిల్లలా తయారైంది. అన్నంత పనీ చేస్తారు వీళ్ళు. ఇక బయట పడే మార్గం లేదు. బ్రతికే అవకాశమూ లేదు.

ఇప్పుడెలా? ఏదో ఒక ప్లాన్ వేసి ఈ గండం గట్టెక్కాలి.

పిల్లిని గదిలో బంధించి కొడ్తే అది పులిలా మనిషి మీదకు విజృంభిస్తుందంటారు.

అక్కడున్న వాళ్ళను చూసింది. లేడి పిల్లను చంపడాని కొస్తున్న సింహాలు గుర్తుకొచ్చాయి!

తన భయాన్ని ముఖంలో కనబడనీయకుండా!

"అలాగే చంపండి! నేను చనిపోయిన ఒకటి రెండు గంటల్లోనే పోలీసులు వచ్చి మిమ్మల్నందర్నీ అరెస్ట్ చేస్తారు. మీరంతా కలసి నన్నిలా చంపుతారని నాకెప్పుడో తెలుసు.

అందుకే! నేను హాస్పిటల్‌లో వుండగా మా నాన్నగారు తన చిన్ననాటి స్నేహితులైన 'ఎస్.పి. జ్ఞానశేఖరం' గార్ని తీసుకొచ్చి నా పరిస్థితంతా వివరించారు. నేను కూడా వారితో మీ గురించి వున్నదున్నట్లుగా అన్నీ చెప్పేశాను. నేను చచ్చిపోయిన తక్షణం మా అత్తగార్ని, నా భర్తను, ఆడబిడ్డల్ని,మామనూ, అందర్నీ అరెస్ట్ చేయండి. వీళ్ళే నా చావుకు బాధ్యులు అని రాసిచ్చాను.

కాబట్టి మీరు కోరి మీ మెడలకు వురి తగిలించుకుంటామూ అంటే నాకేం అభ్యంతరం లేదు."

ఈ మాటలు విని అక్కడున్న వాళ్ళందరూ అలాగే నిశ్చేష్టులై పోయారు.

ఇదే అదననుకుని ఆలస్యం చేయకుండా ఉయ్యాల్లోనున్న పాప నెత్తుకుని, వీధిలో కొచ్చేసి, ఆటోలో కూర్చుని బస్టాండు కెళ్ళమని చెప్పింది.

బస్సులో కూర్చున్నాక, బస్సు బయలు దేరింది. ఒక్కసారి గుండెల్నిండా గాలి పీల్చుకుంది.

"అమ్మయ్య; ఇంకో రెండు గంటల్లో అమ్మ దగ్గర కెళ్ళి పోతాను".

ఏడాది క్రిందట భర్త చేయందుకుని అత్తింట్లో అడుగు పెట్టాను. ఈనాడు నింద మోస్తూ పాప నెత్తుకుని పుట్టింటికెళ్ళి పోతున్నాను.

ఆ మాటనుకోగానే మనసులో ఏ మూలో బాధా వీచిక కదలాడింది.

కుమార్ కొట్టిన బెల్ట్ దెబ్బలు బాగా మంట పుడ్తున్నాయ్.

'ఎలాగైతేనేం! సమయానికీ ఆలోచన వచ్చింది. తడబడకుండా చెప్పేశాను. ఆ నరక కూపం నుండి బయట పడ్డాను అనుకుంది'.

జరిగిందంతా ఒక పీడ కలనుకుని మరచిపోవాలి!

దివ్య ఒడిలో కూర్చుని ఆడుకుంటున్న చిన్నారి చిట్టి పాప 'నవ్య'ను తనివి తీరా గుండెలకు హత్తుకుని ముద్దు పెట్టుకుంది.

'ఇక నాకూ స్వేచ్ఛ వచ్చింది. ఇప్పుడు నువ్వు వరకుమార్ కూతురు నరస కుమారివి కాదు తల్లీ! దివ్య పాప నవ్యవు. సంతోషంతో మనసంతా హాయిగా దూది పింజలా తేలిపోతూంది.

*

నమ్మరు

